క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



డిచ్‌పల్లి: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన ర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) చక్రవర్తుల తరుణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నడిపల్లి, బర్ధిపూర్, ధర్మారం (బి) గ్రామాలను గురువారం భారీ వర్షంలో డీపీవో సందర్శించారు. ఆయా గ్రామాల్లో కొన సాగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. డీపీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎప్పటికప్పుడు డ్రెయినేజీలను శుభ్రం చేయాలని, చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించాలని ఆదేశించారు. ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు నిట్టు కిషన్‌రావు, వసంత్‌రావు, జయశ్రీ, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని మంచినీటి ట్యాంకులను, పారిశుధ్య పనులను గురువారం ఎంపీవో యూసుఫ్‌ఖాన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. రోడ్ల వెంబడి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీపీ కార్యదర్శి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపడతాం



సిరికొండ: తూంపల్లి నుంచి పాకాలకు వెళ్లే దారిలో వంతెన వద్ద కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపడతామని పంచాయతీరాజ్ డీఈ రాంచందర్ తెలిపారు. రోడ్డు సమస్యపై కాంగ్రెస్ నాయకులు బాలరాజ్‌నాయక్ ఇటీవల కలెక్టర్‌ను కలిసి వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈ రోడ్డును గురువారం పరిశీలించారు. వర్షాకాలం ముగిసిన తర్వాత శాశ్వతంగా గోడ నిర్మాణం చేపడతామని, అంతవరకు ఇప్పుడు రాకపోకల పునరుద్ధరణకు మొరం పోయించి వాహనాలు నడిచేలా చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు. పీఆర్ ఏఈ హైమద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు బాలరాజ్‌నాయక్ ఉన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలి



ఇందల్వాయి: అసంక్రమిత వ్యాధులైన హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని ఆరోగ్య కార్యకర్తలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షకుడు అబ్దుల్ షఫి సూచించారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించేలా, వైద్య సేవలు పొందేలా ప్రోత్సహించాలన్నారు. హెచ్ఈవో శంకర్, అసంక్రమిత వ్యాధుల జిల్లా అధికారి వినీత్, ఊహ, వెంకటేష్, క్షయ వ్యాధి నియంత్రణ అధికారి సంతోష్, వెంకట్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

కుక్కలకు కు.ని. ఆపరేషన్లు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని డీఆర్‌సీ సెంటర్‌లో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభించారు. ఆపరేషన్లు ఏ విధంగా జరుగుతున్నాయే తెలుసుకోవడానికి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ గురువారం పరిశీలించారు. కుక్కలకు ఆపరేషన్లు,ఆహారం ఏవిధంగా పెడుతున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌సీ ఇన్‌చార్జి ప్రభుదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో వనమహోత్సవం



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, సిబ్బంది స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



గాయత్రినగర్‌లో గుంతల రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



గాయత్రినగర్ ముఖద్వారం వద్ద..



గూపన్‌పల్లి ముఖద్వారం వద్ద..

ఆర్యనగర్‌లో..

ఇవి రోడ్లా?.. నీటి కుంటలా?..



కంఠేశ్వర్ నుంచి చంద్రశేఖర్‌కాలనీ వైపు వెళ్లే రోడ్డు

నిజామాబాద్ నగరంలోని ప్రధాన రహదారులు ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. కానీ గల్లీల్లోని అంతర్గత రోడ్లను చూస్తే పైన పటారం.. లోన లొటారంగా మారింది పరిస్థితి. నగరంలోని పలు కాలనీల్లో రోడ్లు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు గుంతల్లో చేరడంతో, రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. నగరంలోని ఆర్యనగర్, వినాయక్‌నగర్, గాయత్రినగర్, ఖిల్లా చౌరస్తా, చంద్రశేఖర్‌కాలనీ, శ్రీనగర్‌కాలనీ, ప్రగతినగర్, గూపన్‌పల్లి, ఐటీఐ వివిధ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. నీరు నిలిచిఉండటంతో వాహనదారులకు గుంతల లోతు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి నగరంలోని అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్



కంఠేశ్వర్ వద్ద గల ఉమెన్స్ హాస్టల్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం



తెయూలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి)/నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. ఈమేరకు తెయూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే నగరంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నరాపు రాజేశ్వర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం రూ.21,292 కోట్లు (7.31శాతం) మాత్రమే కేటాయించారని విమర్శించారు. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు రాజేష్, వరప్రసాద్, దేవదాస్, నాందేవ్, నితీష్, శ్రీకాంత్, ఆకాష్, వంశీ, రాహుల్, సాయితేజ నాగేష్, తెయూ నాయకులు రవీందర్, అక్షయ్ ఆకాష్, అర్జున్, మోహిత్, రాజ్‌కుమార్, యశ్వంత్, అభిషేక్ పాల్గొన్నారు.

బీసీలను విస్మరించారు

ఖలీల్‌వాడి: రాష్ట్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను విస్మరించిందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, కేవలం రూ.9, 900 కోట్లు కేటాయించడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రకుల పేదలకు జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు జరగలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి వాస్తవ పరిస్థితుల్లో అందుకు భిన్నంగా ఖర్చులు చేశారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వ బాటలో నడిస్తే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

బడ్జెట్‌తో ఎస్సీ, ఎస్టీలకు మేలు



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ. 33వేల కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ. 17వేల కోట్లు నిధులు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్‌తో ఎస్సీ, ఎస్టీలకు మేలు జరుగుతుంది. కేటాయించిన నిధులు సకాలంలో విడుదల చేసి, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

ఉపాధిహామీకి మొండి చేయి..



ఖలీల్‌వాడి: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి మొండి చేయి చూపించారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. ఈమేరకు గురువారం నగరంలోని సుందరయ్య కాలనీలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో మార్పులు చేసి తమ డిమాండ్లను అమలు చేయాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు పెద్దివెంకట రాములు, సభ్యులు భీమాశంకర్, శంకర్, వసంత, వరలక్ష్మి ఉన్నారు.

మురుగుకాలువలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మురుగుకాలువలను గురువారం పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో 'సాక్షి'లో నిన్న పారిశుధ్యంపై పట్టింపేది? అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి లింగితండా, ముత్తకుంట గ్రామాల కార్యదర్శులు నికిత, వెంకటేష్‌లు, అధికారులు స్పందించారు. గ్రామాల్లోని డ్రెయినేజీలను జీపీ కార్మికులతో శుభ్రం చేయించారు. ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను, పరిసరాల్లో పేరుకు పోయిన చెత్తాచెదారంను తీసివేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి, అపరిశుభ్రతకు తావు లేకుండా చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ, ఎంపీవో ఇక్బాల్, కార్యదర్శులు పనులను పర్యవేక్షించారు.



ముత్తకుంటలో డ్రెయినేజీని శుభ్రపరుస్తున్న కార్మికుడు



లింగితండాలో..

వర్షంలోనూ విద్యుత్ మరమ్మతులు



నిజామాబాద్‌నాగారం: నగరంలో గురువారం ఉదయం జోరు వర్షం కురుస్తుండగా విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ మరమ్మతులు చేపట్టారు. బీఎస్ఎన్ఎల్ ఆఫీసు నుంచి గాంధీచౌక్ వద్ద కేవీ డిస్క్ ఫెయిల్ కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సిబ్బంది వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మరమ్మతులు చేసి కరెంట్‌ను పునరుద్ధరించారు. ఏడీఈ తోటరాజశేఖర్, ఏఈ సుమిత, ఉద్యోగులను డీఈ శ్రీనివాస్ అభినందించారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	71,200	వెండి (కిలో)	87,000
22 క్యారెట్స్	65,675	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	35	50
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	40	60
బీర్నీసుకాయ	70	100	గోబిగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	60	80	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	70	100	చిక్కుడుకాయ	60	100
క్యాప్సికం	50	75			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	రాయన్(తెలుగు)-10.45, 1.35,4.30,7.25,10.20
స్క్రీన్-2	పురుషోత్తముడు(తెలుగు)-10.40 కల్కి-2898 2డీ(తెలుగు) -4.15,10.20 డెడ్‌పూల్-3డీ(తెలుగు)-1.40,7.30
స్క్రీన్-3	డెడ్‌పూల్-3డీ(తెలుగు)-10.40, 10.40 డెడ్‌పూల్-3డీ(ఇంగ్లీష్)-4.45 కల్కి-2898 2డీ(తెలుగు) -1.20 పురుషోత్తముడు(తెలుగు)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	డెడ్‌పూల్-3డీ(తెలుగు)-11.15,1.15 డెడ్‌పూల్-3డీ(ఇంగ్లీష్)-4.15,7.15, 10.15
స్క్రీన్-2	కల్కి 2898 ఏడీ(తెలుగు)- 11.20 6.15 రాయన్(తెలుగు)- 3.05 10.00
స్క్రీన్-3	బాడ్ న్యూజ్ (హిందీ)-10.00,4.15, 10.30 పురుషోత్తముడు(తెలుగు)- 1.05,7.20
స్క్రీన్-4	రామ్ ఎన్ఆర్ఐ(తెలుగు)-10.10 గల్లీ గ్యాంగ్‌స్టార్స్(తెలుగు)- 1.00 ట్విస్టర్స్(ఇంగ్లీష్)-4.20 రాయన్(తెలుగు)- 7.10 పురుషోత్తముడు(తెలుగు)-10.20
దేవి	రాయన్ (తెలుగు)
నటరాజ్	డెడ్‌పూల్ (తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)

నాన్ లే–అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

సుభాష్‌నగర్: నగరంలోని బోధన్‌రోడ్‌లోగల సర్వే నెంబర్ 2870, 2871లో నాన్ లే–అవుట్ వెంచర్లు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని, వెంటనే ఆ వెంచర్‌ను తొలగించాలని, రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఖైసర్ డిమాండ్‌చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని నిజామాబాద్ సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్యకు వినతి పత్రం అందజేశారు. ఖైసర్ మాట్లాడుతూ.. ఎంఐఎం కార్పొరేటర్లు అభివృద్ధి నిరోధకులని, మైనారిటీ ఏరియాలను పదేళ్లుగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కమీషన్లకు కక్కుర్తి పడి నిబంధనలకు విరుద్ధమైన నాన్ లే–అవుట్ వెంచర్లను ప్రోత్సహిస్తున్నారని, ప్రజలంతా వారికి తగిన సమయంలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న సయ్యద్ ఖైసర్

ఐఏఎస్ స్మిత సబర్వాల్ వ్యాఖ్యలు సరికావు



నిజామాబాద్‌అర్బన్: ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ వికలాంగులపై చేసిన వ్యాఖ్యలు సరికావని, ఆమె వెంటనే వికలాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో స్మిత సబర్వాల్ దిష్టిబొమ్మ దహనం చేశారు. వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షురాలు సూజాత సూర్యవంశీ మాట్లాడుతూ.. ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వికలాంగులకు సివిల్ సర్వీసెస్‌లో రిజర్వేషన్లు ఎందుకు? వారు క్షేత్రస్థాయిలో పని చెయ్యాగలరా? వికలాంగులకు శక్తి సామర్థ్యాలు ఉండవు అని అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సదరు అధికారిణిపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు సరికెల్ల పోశెట్టి, మానికొల్ల గంగాధర్, కనక ప్రమోదు, లసింగారి భూమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం

మోపాల్ ఎంపీడీవోగా రాములు

మోపాల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా రాములు బదిలీపై రానున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో లింగం ఇటీవల బదిలీ అయ్యారు. రాములు నిర్మల్ జిల్లా ముథోల్ నుంచి బదిలీపై వస్తున్నారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

బాధ్యతల స్వీకరణ

ఇందల్వాయి: ఇందల్వాయి డిప్యూటీ తహసీల్దార్‌గా శైలజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన చందన బదిలీపై వెళ్లడంతో నిజామాబాద్ నార్త్ మండలం నుంచి శైలజ బదిలీ అయి, ఇందల్వాయి డీటీగా వచ్చారు.

సిరికొండ ఎంపీవోగా..

సిరికొండ: మండల పంచాయతీ అధికారిగా తారాచంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా పనిచేసిన లక్ష్మీప్రసాద్ నందిపేట్‌కు బదిలీ కాగా తారాచంద్ చందూర్ మండలం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ జిల్లా పరిషత్‌కు, టైపిస్ట్ చంద్రశేఖర్ భీంగల్‌కు బదిలీ అయ్యారు. జెడ్పీ నుంచి రామ్‌దేవేందర్ సీనియర్ అసిస్టెంట్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఎంపీవోను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. మండల కేంద్రంలో పారిశుధ్య పనులను ఎంపీవో పరిశీలించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. కిషన్, సురేష్, శోభారాణి, ఉమారాణి పదోన్నతిపై వెళ్తుండగా పాటు రమాదేవి, రాజేశ్వర్, సుజాత బదిలీపై వచ్చారు. హెచ్‌ఎం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరుల కుటుంబాలకు..

సుభాష్‌నగర్: హైదరాబాద్‌లోని సీఎంఆర్ సెంట్రల్ ఆడిటోరియంలో గురువారం 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా జమ్మూకాశ్మీర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. అంతకుముందు అమరవీరుల స్మృతివనంలో అతిథులు మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం, ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై కుప్పు స్వామి, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్‌తో కలిసి ఎంపీ అర్వింద్ ధర్మపురి సతీమణి ప్రియాంక ధర్మపురి మొక్కలు నాటారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని అమరుల త్యాగాలను కొనియాడారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాల కోసం వచ్చే నెల 2వరకు దోస్త్ ఆన్‌లైన్‌లో ప్రత్యేక విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ ద్వారా వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవడానికి ఈనెల 27నుంచి ఆగస్టు 3వరకు అవకాశం ఉందన్నారు. బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, వివిధ కోర్సులకు సంబంధించి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎడిటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్నిక

నిజామాబాద్ నాగారం: ది ఎడిటర్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కానుకంటి శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నిరంతర జ్వాల పత్రిక ఎడిటర్ కానుకంటి శివప్రసాద్ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అసోసియేషన్ అధ్యక్షులు సింగోజు దేవిదాస్ తెలియజేశారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సిరిగాద ప్రసాద్, క్యాషియర్ సురేందర్, మండే మోహన్, రవిబాబు, రాజలింగం, అక్షరం ప్రసాద్, విజయ్ పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల ప్రదర్శన



మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షా–సప్తాహ్ సాంస్కృతిక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం బోనాలను ఏర్పాటు చేసి, ప్రదర్శించారు. ఉత్సవ ప్రాధాన్యతను ఉపాధ్యాయులు వివరించారు. బాడ్సి, కులాస్‌పూర్, న్యాల్‌కల్, చిన్నాపూర్ బడుల్లో శిక్షా–సప్తాహ్ నిర్వహించినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్ తెలిపారు.

పీజీ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు గురువారం 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్‌లోని పరీక్షా కేంద్రాల్లో పీజీ ఇంటిగ్రేటెడ్ 6, 8, 7, 9, 10వ సెమిస్టర్, పీజీ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఉదయం జరిగిన పరీక్షలో 71 మంది విద్యార్థులకు గానూ 71 మంది హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 187 మంది విద్యార్థులకు గానూ 169 మంది హాజరైనట్లు చెప్పారు.